క్లుప్తంగా

కుట్టుమెషీన్ల పంపిణీ



పంపిణీకి సిద్ధం చేసిన కుట్టుమెషీన్లు, గ్రైండర్లు

సీటీఆర్ఐ: పేద మహిళల స్వయం ఉపాధి కోసం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్లు పంపిణీ చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316బీ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, దాతల సహకారంతో స్థానిక హోటల్ రివర్‌బే ఆహ్వానం ఫంక్షన్ హాల్లో గురువారం మెగా సేవామహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు మాట్లాడుతూ రూ.10 లక్షలతో వంద మంది మహిళలకు కుట్టుమెషీన్లు, మరో 40 మందికి వెట్ గ్రైండర్లు బహూకరించామన్నారు. లయన్స్ పూర్వపు ఇంటర్నేషనల్ డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్, నడింపల్లి వినోద్, మంతెన విశాలాక్షి, శ్రీవిద్య పాల్గొన్నారు.

'జాస్తి బుల్లెమ్మ'లో ఏయూ దూరవిద్య

కంబాలచెరువు: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య (డిస్టెన్స్ ఎడ్యుకేషన్)ను స్థానిక జాస్తి బుల్లెమ్మ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర విశ్వవిద్యాలయం డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎంవీఎస్ చంద్రశేఖర్, జాస్తి బుల్లెమ్మ విద్యాసంస్థల అధినేత జాస్తి మూర్తి, ప్రిన్సిపల్ జ్యోతి సంయుక్తంగా వెల్లడించారు. స్థానిక రివర్‌బే హోటల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రవేశ పెట్టిన దూర విద్య త్వరలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకోబోతుందన్నారు. దీనిద్వారా పొందే సర్టిఫికెట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎటువంటి సమస్యలు లేకుండా అనుమతి ఇస్తారన్నారు. బీఏ, బీకాం, పీజీలో ఎంఏ జర్నలిజం, పాలిటిక్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిందీ, మ్యాథమెటిక్స్, ఎంఎస్సీ ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, సైకాలజీ, ప్రాక్టికల్ కోర్సుతో ఎంబీఏ ఎంసీఏ అందిస్తున్నామన్నారు. ఆసక్తి కలవారు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించవచ్చని, చెల్లింపులు స్టడీ మెటీరియల్స్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు.

చదువుకు సాయం



రామలక్ష్మి చదువుకు సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులో క్యాన్సర్‌తో బాధపడుతున్న బడుగుబున్నీని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్ గురువారం పరామర్శించారు. వైద్యం కోసం ఏమన్నా అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పదో తరగతి పాసైనా ఆర్థిక స్థోమత లేక ఇంటర్ చేరడం మానేసిన దాసి డేవిడ్ కుమార్తె రామలక్ష్మికి నగదు అందజేశారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ



విద్యార్థులు తయారు చేసిన బొమ్మలతో అర్బన్ డీఐ దిలీప్ కుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవిశిక్షణ తరగతులు విద్యార్థుల్లో ఏకాగ్రత, సృజనాత్మకతను పెంచడానికి దోహదపడుతున్నాయని అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం జరిగిన తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. పుస్తక పఠనం, తెలుగు పద్యాలు, లలిత సంగీతం, కోలాటం తరగతులు నిర్వహించారు. సీతా శారద విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీ నిర్వహించారు. ట్రస్టు సభ్యులు బొడ్డు శ్రీనివాసు, వరలక్ష్మి దంపతులు విద్యార్థులకు శెనగలు, ఆరంజ్ జ్యూస్ అందించారు.

యువకుడిపై కేసు

ధవళేశ్వరం: పెళ్లి చేసుకోకపోతే చంపుతానని బెదిరిస్తున్న యువకుడిపై ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ధవళేశ్వరానికి చెందిన ఓ యువతి, సాయిమోహన్ అనే యువకుడు నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల సాయిమోహన్ ప్రవర్తన నచ్చక యువతి దూరం పెట్టింది. దీంతో తనని పెళ్లి చేసుకోకపోతే చంపేస్తానని, ఇద్దరివి కలిసివున్న ఫొటోలు అందరికీ పంపిస్తానని సాయిమోహన్ బెదిరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ కె.మంగాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిసార.. అప్రమత్తతే రక్ష

- వర్షాకాలం ప్రారంభంతో ప్రబలే ప్రమాదం
- ముందు జాగ్రత్త చర్యలకు ప్రభుత్వం శ్రీకారం
- మొదలైన అతిసార నియంత్రణ పక్షోత్సవాలు
- ఈ నెల 17 వరకూ అవగాహన కార్యక్రమాలు



అన్నదేవరపేట పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

రాజమహేంద్రవరం రూరల్: ఇప్పటి వరకూ వేసవి ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలను తొలకరి చినుకు పలకరించనుంది. వర్షాకాలం ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో కురిసే వానలకు తాగునీరు కలుషితమై అతిసార ప్రబలే ప్రమాదం ఉంది. ఎక్కువగా చిన్నారులు వాంతులు, విరేచనాల (అతిసార)కు గురయ్యే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఉధృత అతిసారపై అప్రమత్తం చేస్తోంది. జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న ప్రారంభమైన అవగాహన కార్యక్రమాలు 17వ తేదీ వరకూ జరగనున్నాయి.

విస్తృత అవగాహన

జిల్లాలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రితో పాటు అనపర్తి ఏరియా ఆసుపత్రి, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 15 పట్టణ ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. అలాగే 1,556 అంగన్‌వాడీ కేంద్రాలు, 119 వార్డు సచివాలయాలు, 393 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 1,362 మంది ఆశాలు, 512 మంది ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి అతిసార వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే అన్ని ఆరోగ్యకేంద్రాలకు 9,00,000 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 6,53,069 జింక్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన తర్వాత ఓఆర్ఎస్, జింక్‌మాత్రలు వాడాల్సిన విధానంపై ఆశాలు, ఏఎన్ఎంలు అవగాహన కల్పిస్తున్నారు.

ఓఆర్ఎస్, జింక్‌తో అతిసారకు చెక్

- పిల్లలకు అతిసార సోకి విరేచనాలు అవుతున్నప్పుడు ఓఆర్ఎస్ చక్కటి ఔషధంగా పని చేస్తుంది. ఇందుకు చేయాల్సిందిల్లా ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను ఒక లీటర్ తాగునీటిలో శుభ్రమైన పాత్రలో కలపాలి.
- ఈ ద్రావణాన్ని పిల్లలకు విరేచనాలు మొదలైనప్పుడు, ప్రతి విరేచనం తర్వాత తాగించాలి.
- రెండు నెలల కంటే తక్కువ వయసున్న శిశువుకు ఐదు స్పూన్ల ద్రావణం, 2 నెలల నుంచి రెండేళ్ల పిల్లలకు పావు కప్పు నుంచి అరకప్పు వరకు, రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకూ పిల్లలకు ప్రతి విరేచనం తర్వాత అరకప్పు నుంచి ఒక కప్పు వరకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఇవ్వాలి.
- విరేచనాలు తగ్గే వరకు ఈ ద్రావణాన్ని పిల్లలకు ఇస్తూ ఉండాలి. దీంతో పాటు ఒక చెంచా తాగునీరు లేదా తల్లిపాలలో ఒక జింక్‌మాత్రను బాగా కలిపి 14 రోజుల పాటు పిల్లలకు ఇవ్వాలి.
- జింక్ అతిసార వ్యాధి తీవ్రతను తగ్గిస్తుంది. మూడు నెలల పాటు అతిసార రాకుండా కాపాడుతుంది. రోగ నిరోధకశక్తిని పెంచుతుంది.
- అతిసార, అనారోగ్యం ఉన్న సమయంలోనూ తల్లిపాలు బిడ్డకు నిరభ్యంతరంగా ఇవ్వొచ్చు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

పిల్లలకు, పెద్దలకు అతిసార వ్యాధి ప్రబలకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. భోజనానికి ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వంటకు ముందు, పిల్లలకు ఆహారం తినిపించే ముందు చేతులు శుభ్రపర్చుకోవాలి. పిల్లలు మలాన్ని శుభ్రం చేసిన తర్వాత కూడా సబ్బుతో చేతులను కడుక్కోవాలి.

తల్లిపాలు తాగించడం మానకూడదు



తల్లిపాలు తాగే పిల్లలకు విరేచనాలు అయితే తల్లిపాలు తాగించడం మానకూడదు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఐసీడీఎస్, డీపీవో, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర శాఖలను సమన్వయం చేసుకుని అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ మేరకు ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్ వాడీలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పిల్లల ఆరోగ్యం గురించి తెలుసుకుని వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు.

– డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో, తూర్పుగోదావరి జిల్లా

జాతీయ పోటీలకు ప్రభాత్ సాయి



ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 13 వరకు భోపాల్‌లో జరిగే అండర్ 19 జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్‌కు రాజమహేంద్రవరానికి చెందిన టి.ప్రభాత్ సాయి ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రభాత్ సాయి జాతీయ పోటీలకు అర్హత సాధించాడన్నారు. అతడిని టీటీఎఫ్ఐ ఉపాధ్యక్షుడు వి.భాస్కర్ రామ్, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ సుబ్బారావు, కోశాధికారి సత్యనారాయణ, కోచ్ పి.వేణు గోపాల్ అభినందించారన్నారు.

వినూత్నంగా ఆలోచించాలి

ప్రకాశం నగర్: విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కె.సతీష్ బాబు అన్నారు. స్థానిక సీతంపేట గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం నిర్వహించే సైన్స్ కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులు తయారు చేసిన క్రాఫ్ట్ బొమ్మలను టీచర్ రాజ్ కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి సుగుణ కుమారి, డి.రాజు పాల్గొన్నారు.



శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్

నగరంలో డ్రైనేజీల అభివృద్ధికి చర్యలు

- ఎంపీ భరత్‌రామ్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని డ్రైనేజీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక 42, 43, 44, 47 డివిజన్లలో డ్రైనేజీల ఆధునీకరణ పనులకు స్థానిక 43వ డివిజన్ జడ్డి బంగ్లా వాటర్ ట్యాంకుల వద్ద గురువారం శంకుస్థాపన చేశారు. ఆ నాలుగు డివిజన్లలో సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర ప్రధాన డ్రైనేజీలు, చిన్న డ్రైనేజీలను రూ.85 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్టు ఎంపీ తెలిపారు. 42వ డివిజన్ మున్సిపల్ కాలనీ వాంబే గృహాల వద్ద 120 మీటర్లు, 43వ డివిజన్‌లో జడ్డి బంగ్లా నుంచి గౌతమీ నేత్రాలయం వరకూ 550 మీటర్లు, మల్లికార్జున నగర్‌లో 700, 44వ డివిజన్ పీఅండ్‌టీ కాలనీలో ఇంటర్నల్ స్ట్రీట్స్ 500 మీటర్లు, 47వ డివిజన్‌లో ఇందిరాసత్యనగర్‌లో 500 మీటర్లు పొడవైన డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే నగరంలో ప్రధాన రహదారులను అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నగరంలోని ప్రతి డివిజన్ అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేయగా, ఆ నిధులను డ్రైనేజీలు, వీధులు, వివిధ అభివృద్ధి పనులకు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మజ్జి అప్పారావు, నక్కా నగేష్, కాటం రజనీకాంత్, గుత్తుల మురళీధర్, ముప్పన ప్రభాకర్, మానే దొరబాబు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రకాశం నగర్: ప్రకాశం జిల్లా టంగుటూరు రావివారిపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తను ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గురువారం గణేష్ చౌక్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి శారద, సునీత మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మార్కెట్‌లోకి హోండా షైన్ 100 సీసీ మోటారు సైకిల్



మోటారుసైకిల్‌ను విడుదల చేస్తున్న జీఎం కోటేశ్వరరావు, వినయ్ జలీహాల్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): హోండా సంస్థ తొలిసారిగా 100 సీసీ మోటారు సైకిల్‌ను ప్రవేశపెట్టింది. జిల్లాలో తొలి బైక్‌ను ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న మైహోండా షోరూమ్ ద్వారా గురువారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. దీన్ని షోరూమ్ జీఎం బి.కోటేశ్వరరావు, హోండా సర్వీస్ ఏరియా ఇన్‌చార్జి వినయ్ జలీహాల్ ప్రారంభించారు. జీఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి వరకూ హోండా ద్విచక్ర వాహనాల్లో 100 సీసీ లేదని, తొలిసారిగా దీన్ని ప్రవేశపెట్టారన్నారు. లీటరు పెట్రోలుతో 80 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని, సెల్ఫ్‌స్టార్ట్, ఎల్లాయ్ వీల్స్‌తో ఒకే రంగులో లభిస్తోందన్నారు. సైడ్ స్టాండ్ ఇండికేటర్ ఏర్పాటు చేశారన్నారు. ఎక్స్ షోరూమ్ ధర రూ.66,300 ఉందన్నారు. వినయ్ జలీహాల్ మాట్లాడుతూ హోండా పరిశ్రమలోనే తొలిసారిగా తమ వాహనాలకు పదేళ్ల వారంటీ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో షోరూమ్ సర్వీస్ మేనేజర్ ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీల గుండెల్లో జగన్‌కు సుస్థిర స్థానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆరిఫ్ తదితరులు

ప్రకాశం నగర్: హజ్ యాత్రకు వెళుతున్న ముస్లింలకు అన్నివిధాలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మైనార్టీల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించారని జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ అన్నారు. ఆయన గురువారం తన నివాసంలో జిల్లా కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మసీదులకు వెళ్లి ఇమామ్, హౌజన్ల గౌరవ వేతన వివరాలు, మసీదుల స్థితిగతులను పరిశీలించి, స్థానికంగా వారికున్న అవసరాలను తెలుసుకొని నేరుగా ప్రభుత్వానికి తెలియజేసే కార్యక్రమానికి చేపట్టనున్నట్టు తెలిపారు. హజ్ యాత్రికులపై అదనపు భారం పడకుండా దాదాపు రూ.15 కోట్లను తక్షణం విడుదల చేసి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలపై తనకున్న ప్రేమను చాటుకున్నారన్నారు. మైనార్టీలు నూటికి నూరుశాతం జగనన్న వెంట నడిచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రెండోసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ షేక్ వజీరుద్దీన్, జిల్లా డైరెక్టర్లు షబ్బర్ బాషా, సయ్యద్ రబ్బానీ, షేక్ అహ్మద్, పఠాన్ రహీం, జఫ్రుల్లా ఖాన్, షేక్ బిజిలానీ, షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉచిత, పేమెంట్ పాస్‌లను ఒక నెల, మూడు నెలలు ఏడాది కాల పరిమితితో జూన్ 6 నుంచి జారీ చేస్తున్నారు. ఈ విషయాన్ని ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ షబ్నం గురువారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏప్రిల్ 30 వరకూ, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న వారికి మే 31 వరకు, ఐటీఐ విద్యార్థులకు ఆగస్టు 2023 నుంచి జూలై 2024 వరకు, ఎలిమెంటరీ, హైస్కూల్ విద్యార్థులకు జూన్ 12, 2023 వరకు పాస్‌లు మంజూరు చేస్తామన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ధవళేశ్వరం: ఆటో ఢీకొనడంతో ధవళేశ్వరం కాటన్ పేటకు చెందిన మట్టా నరసింహరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన మంగళవారం రాత్రి బుల్లెట్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తుండగా ధవళేశ్వరం అత్తిలి వెంకన్న పాన్‌షాప్ సమీపంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. తీవ్ర గాయాలైన నరసింహరాజును 108లో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సీఐ కె.మంగాదేవి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన

ధవళేశ్వరం: గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు మెండా సీతారామయ్య, డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, పండిళ్ల భానుప్రసాద్, సాధనాల చంద్రశేఖర్(శివ), వడ్లమూడి కుమార్, పిన్నింటి ఏకబాబు, ఆళ్ల ఆనందరావు, ఒంటెద్దు స్వామి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ధవళేశ్వరం: నలజర్ల నుంచి కాకినాడకు తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని గురువారం ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసును ఎస్సై క్రాంతి కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

పీఆర్‌సీ నియామకంపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ: గడువుకు ముందే 12వ వేతన సవరణ సంఘం నియామకం (పీఆర్‌సీ)పై నగర ఎన్‌జీఓ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వైవీఎస్ నాయుడు, ఎస్.ప్రవీణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. 2014 జూన్ 6కు ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై కృతజ్ఞతలు తెలిపారు. 1980లో ఏర్పాటైన ఏపీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల నెలవారి జీతాల విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో 010 జీతాలు చెల్లింపు నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలపడం సంతోషమన్నారు. ఉద్యోగుల సామాజిక భద్రతగా భావిస్తూ సీపీఎస్‌కు బదులు పాత పింఛన్ విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- అందరి సంక్షేమమే జగన్ లక్ష్యం
- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్



తలసేమియాతో బాధపడుతున్న చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరు గ్రామసచివాలయం–4 పరిధిలో గురువారం మూడోరోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాల లబ్ధిని తెలిపారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన అమ్మఒడి పథకంపై ఇష్టానుసారంగా మాట్లాడిన చంద్రబాబు.. ఇప్పుడు అమ్మకు వందనం అని హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని గతంలో ఒకసారి మోసం చేశారని, మరోసారి మోసం చేసేందుకు సిద్ధపడుతుండడం సిగ్గుచేటన్నారు. బాబు ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు మోసపోరని తెలియజేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసి ప్రజలు గుండెల్లో నిలిచిపోయారన్నారు. నాలుగు తరాలు గుర్తుపెట్టుకునే విధంగా జగన్ పాలన సాగుతుంటే, 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఎన్ని రకాలుగా మోసం చేశారో అందరికీ తెలుసునన్నారు. స్థానిక ఉన్న సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, సచివాలయ కన్వీనర్లు మద్దా దుర్గారావు, పొర్ల సురేష్, గంగిపాముల సురేష్, యెజ్జువాసు, ఆచంట కళ్యాణ్, కొత్తపల్లి నాగేశ్వరరావు, పక్కా ధనరాజు, దేవమాత, కప్పల సూర్యకుమారి, రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఉద్యోగికి లోన్‌యాప్ వేధింపులు

ధవళేశ్వరం: కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.అనంత నాగభాను సందీప్‌ను లోన్‌యాప్ నిర్వాహకులు మార్ఫింగ్ ఫొటోలతో వేధిస్తున్నారు. ఆయన గతనెల 30న వివిధ లోన్‌యాప్‌ల్లో రూ.6 వేలు లోన్ తీసుకున్నారు. అనంతరం అదనంగా డబ్బులు కట్టాలని బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. ఆయన, అతడి భార్య ఫొటోలను మార్ఫింగ్ చేసి పంపుతూ వేధింపులకు గురిచేస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ మంగాదేవి కేసు నమోదు చేశారు.

'బంగారుకొండ'కు ఆర్థిక సాయం అందిస్తా



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు జయరాజు

కడియం: బంగారుకొండ పథకానికి తనవంతు ఆర్థికసాయం అందిస్తానని వేమగిరితోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.జయరాజు అన్నారు. పాఠశాల ఆవరణలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఈ మేరకు ఆయన ప్రకటించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీవో టి.కల్పలత మాట్లాడుతూ చిన్న పిల్లలలో పోషకాహారలోపం తీర్చడానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో తీసుకోబోతున్న ఈ పథకానికి మంచి మనసుతో దాతలు ముందుకు రావాలని కోరారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.సత్యశ్రీ మాట్లాడుతూ దాతలు రూ.3వేల ఆర్థిక సహాయానికి ముందుకు వస్తే ఒక పాప లేదా బాబు ఆరోగ్యవంతులవుతారన్నారు.

రాపాకలో నాటు కోడిపుంజుల ఫారం దగ్ధం

సీతానగరం: రాపాకలో గుర్రం జయ మురళీకృష్ణకు చెందిన నాటు కోడిపుంజుల ఫారం గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇక్కడ తాటాకుల పాకలో 18 నాటు కోడిపుంజులను పెంచుతున్నాడు. ఒక్కొక్క కోడిపుంజు విలువ రూ 50 వేలు నుంచి రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రమాదం జరిగిన వెంటనే నాలుగు కోడిపుంజులను బయటకు తీసుకురాగా, మిగిలిన 14 పుంజులు కాలిపోయాయన్నాడు. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక అధికారి కె.రమణ, సిబ్బంది పి.శ్రీనివాస్ మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల నష్టం సంభవించింది.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

అనపర్తి: స్థానిక పాతవూరులో పునఃనిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలు గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వేదపండితులు ఉదయం సంకల్పం, అగ్ని ప్రణయనం, కలశారాధన, ఉక్తహోమం, రత్నన్యాసం తదితర విశేష పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానసాగమ విద్వాంసులు ప్రొఫెసర్ వేదాన్తం శ్రీవిష్ణు భట్టాచార్యులు నిర్వహణలో, బ్రహ్మశ్రీ మిక్కిలి దుర్గయ్యశాస్త్రి పర్యవేక్షణలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రధాన కర్తలుగా, డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి, ప్రియాంక దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు యంత్ర, విమాన శిఖర, బలిపీఠ, జయ, విజయ, విష్వక్సేన, గరుడ, ధ్వజస్తంభ, విఖనస మహాముని సహితంగా విగ్రహ ప్రతిష్ఠ, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శతాబ్దాల చరిత్ర గల ఈ ఆలయ జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు ఈ నెల 4న ప్రారంభమైన నాటి నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన దాతలు, వేదపండితులను ఎమ్మెల్యే దంపతులు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో సుమారు 10 వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

సినిమాలు



శ్యామల	: అహింస
సూర్యమినీ	: విమానం
సూర్యప్యాలెస్	: ట్రాన్స్‌ఫార్మర్స్
స్వామి	: బిచ్చగాడు–2
శివజ్యోతి	: ఇంటింటి రామాయణం
అనుశ్రీ	: ట్రాన్స్‌ఫార్మర్స్
రాజా	: ట్రాన్స్‌ఫార్మర్స్
అశోక	: టక్కర్
ఊర్వశి	: అన్‌స్టాబుల్
రంభ	: విమానం
మేనక	: యూనివర్సిటీ
అప్సర	: 2018
నామవరం	
వీఎస్ మహల్	: ట్రాన్స్‌ఫార్మర్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: టక్కర్
కడియం	
వెంకటసూర్య	: టక్కర్